స్తాను....”ఆవేశంగా అన్నాడు. “నాయనా, ఈ పని ముందే చేసి ఉంటే మేము నోరు మూసుకుని వుండేవాళ్ళం కదా” హేళనగా అన్నారు ఎవరో. జానకి సుధాకర్‌ని తీక్షణంగా చూసింది-అడుగు వెనక్కి వేసింది. “ఆగు, సుదాకర్, ఇదేం సినిమా కాదు- ఎవరో ఏదో అన్నారని కుంకం పెట్టేస్తే పెళ్ళయిపోడానికి....ఆవేశంతో పిచ్చిపని చేసి వదినగారూ అని పిల్చిన పిలుపుకి అపవిత్రత అంటగట్టకు....ఇద్దరు పిల్లల తల్లిని, మొగుడు పోయిన దాన్ని పెళ్ళాడాల్సిన ఖర్మ నీకేంటి-నేనేం రంభను కాదు. అందం చూసి చేసుకోడానికి. ఐదువేలు తెచ్చుకుంటున్నావు. చక్కటి పిల్ల నీకు దొరుకుతుంది - నా మీద జాలితో, ఆవేశంతో చేసి, నీవాళ్ళతో విరోధం తెచ్చుకుని, ఆవేశం తగ్గాక పిచ్చిపని చేశానని, నీవు బాధపడి, నన్ను బాధపెట్టి మన జీవితాలు నరకం చేసుకోవద్దు. ఎవరికోసమో ఇలాంటి పని చెయ్యకు. మన మధ్య ఉన్న అనుబంధాన్ని, పవిత్రతని ఈ మూర్ఖులు అర్థం చేసుకోకపోతే అలాంటివాళ్ళ కోసం మనం బాధపడక్కరలేదు. నీ పెళ్ళయ్యే వరకు ఇక్కడే ఉండు. రేపటి నుండి నా జోలికి ఎవరైనా వస్తే పోలీస్ కంప్లైంట్ యిస్తాను నన్ను హరాస్ చేస్తున్నారని. వెళ్ళండి. అందరూ వెళ్ళండి. మీ ఇష్టం వచ్చినట్టు మీరనుకోండి. నాకేం అక్కరలేదు.” జానకి ఆవేశంగా అందరినీ దులిపేసి విస విస వెళ్ళిపోయింది.

అమాయకురాలు, ఎలా బతుకుతుందో అన్న జానకి, అట్టే చదువుకోని జానక్కి ఎంతధైర్యం వచ్చింది....నీటి ప్రవాహంలో పడిన వారికే నీటికి ఎదురీదే ధైర్యం, సాహసం వస్తాయి గాబోలు! గదిలో పెట్టి కొడితే పిల్లి కూడా పులి అవుతుందంటే ఇదేనేమో! ఈ సమాజాన్ని ఎదిరించి బతకాలంటే మొండిధైర్యం, తెగింపు ఉండాలి జానకిలాంటి నిస్సహాయులకి! అది పరిస్థితులే కల్పిస్తాయేమోనని పించింది నిర్మలకి. ★

# దూరపు కొండలు

సాయంకాలం అయిదు గంటలు దాటింది. అప్పటిదాకా ఎండకి యిళ్ళల్లో మగ్గిన మనుషులు చల్లగాలికి బయటికి రాసాగారు.

జానకి అప్పుడే వంట ముగించి, స్నానం చేసి తెల్ల చీర కట్టుకుని, మల్లె మొగ్గలు పట్టుకుని డాబా ఎక్కింది. పిట్టగోడమీద కూర్చుని పూలు గుచ్చుకుంటూ

రోడ్డుమీద వచ్చేపోయే జనాన్ని చూస్తూండడం జానక్కి కాలక్షేపం. ప్రక్కవాటా ఖాళీ అయేక బొత్తిగా ఏం తోచకుండాపోయింది. మళ్ళీ ఎవరన్నా అందులో చేరి, వాళ్ళతో పొందుకుదిరితేగాని తనకు ఈ ఒంటరితనం పోదు. ఇంతకుముందుండిన వాళ్ళతో బాగా కాలక్షేపం అయేది. పిల్లా జెల్లా, ఇంటావిడ బాగా కలివిడిగా వుండే వారు. మళ్ళీ వచ్చేవాళ్ల అంత మంచిగా వుంటారని నమ్మక మేముంది! పోనీ, ఈ ఎండలు తగ్గేవరకూ ఎవరూ రాకుండా వుంటేనే కొంత నయం: రాత్రులు ఇరుకు గదుల్లో, ఉక్కలో దోమల సంగీతంతో నిద్రపట్టక బాధ పడడమన్నా తప్పి పోతుంది! హాయిగా చల్లగాలిలో పడుకోవచ్చు.

అది రెండు వాటాల పెద్ద యిల్లు, ఒకటి మూడుగదుల వాటా, ముప్పయి రూపాయల అద్దె, అందులో జానకీవాళ్ళు వుంటున్నారు. ప్రక్క భాగం చాలా పెద్దది. ఆరేడు గదులు. ఎదురుగా గేటు: అద్దె వంద రూపాయలు. డాబా మెట్లు ఆ భాగంవైపునించి వుండడం, ఎక్కువ అద్దె ఇచ్చేభాగం గనుక, డాబా వాళ్ళకిందే జమ.

పరధ్యానంగా చూస్తున్న జానకి ఆలోచనలూ, చూపులూ రోడ్డు మీద ఇంటికి కొద్దిదూరంలో ఆగిన కారులోంచి దిగిన ఒకతని మీదకి మళ్ళగానే ఎవరో కుదిపి నట్లయింది. ఎక్కడో చూసినట్లుంది. ఎక్కడో! పాతపడ్డ జ్ఞాపకాల పుటలను ఎంత తిరగేసినా అంతు చిక్కలేదు. అతను ఎటో వెళ్ళిపోయేడు. దండగుచ్చిన మల్లెలు తలలో పెట్టుకుని ఆరోజే వచ్చిన పత్రిక పట్టుకుని చాప మీదకి ఒరిగింది జానకి.

క్రింద ఆడుకుంటున్న మధూ, పాపా పరిగెత్తుకుంటూ వచ్చి "అమ్మా, మనిం టికి ఎవరో వచ్చారే రా!" వగర్చుకుంటూ ఏక కంఠంతో అన్నారు.

"ఎవరు? మగవాళ్లా, ఆడవాళ్ళా? నాన్న లేరని చెప్పలేదూ?" లేవకుండానే జవాబిచ్చింది జానకి.

"చెప్పాను. మీ అమ్మగారిని పిలవ మన్నారు. రా అమ్మా!" తల్లి కొంగు పట్టుకుని లాగుతూ అన్నాడు మధు.

"అబ్బబ్బ, వుండరా వస్తున్నాను." విసుక్కుంటూ క్రిందికి దిగివచ్చి, వీధి వరండాలో లైటువేసి గుమ్మంలోకి వచ్చిన జానకి తొట్రుపడి ఒక్కడుగు వెనక్కి వేసింది. అతనే! ఎందుకో! ఆలోచిస్తూ. ఏమనాలో తోచక, అలాగే చూస్తూ దగ్గిర తలుపుచాటుగా నిలబడింది జానకి.

అతనుకూడా జానకిని చూసి కొంచెం కలవరపడ్డాడు, మొగంలో రంగులు మారాయి. ఏదో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లు అలా రెండు నిముషాలు చూస్తూ ఊరు

కుండిపోయేడు. అంతలోనే సర్దుకుని, గొంతు సవరించుకుని, ఈ ఇల్లు అద్దెకిస్తారని తెలిసింది. తాళం మీదగ్గర వుందని ఇంటివారు చెప్పారు. ఒక్కసారి యిస్తే ఇల్లు చూస్తాం" అన్నాడు.

జానకి తెప్పరిల్లింది. తేలిగ్గా ఊపిరి తీసుకుని "పట్టుకొస్తానుండండి" అని లోపలికి వెళ్ళి తాళంచెవి అతనిచేతి కిస్తూ మరోసారి మొహంలోకి చూసింది.

తాళం తీసుకొని ఆయనా, కూడావున్న అతనూ లోనికి వెళ్ళగానే గుమ్మానికి అలా జేరగిల పడిపోయింది జానకి. గుర్తు వచ్చింది! ఆయన!....నాన్న అష్టకష్టాలు పడి ఎలాగైనా తనని యివ్వాలనుకున్న సంబంధం! తండ్రి పేరుమోసిన ప్లీడరు! చివరికి - డబ్బూ, హోదా, అందచందాలూ, పేటిలోనూ వాళ్ళ స్థాయికి తగదని తేలాక, యిలా....

గత స్మృతులను మననం చేసుకుంటున్న జానకి "ఇల్లు బాగానే ఉంది. ఇంటి వారికి అడ్వాన్సు ఇచ్చి, రేపే చేరుతాము" తాళాలు అందిస్తూ అత నన్న మాటలకి ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చింది.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుంది....ఆఁ....అన్నట్లు మీరు సీతారామయ్య గారి అమ్మాయికదూ?!"

జానకి సిగ్గుపడుతూ తల ఊపింది

"క్షమించండి, ముందర జ్ఞాపకం రాక అడిగాను. మీ నాన్నగారు బావున్నారా? మీ వారి కేం పని? వీళ్ళిద్దరూ మీ పిల్లలా?" మర్యాదగా అత నడిగిన ప్రశ్న లన్నింటికీ జవాబు చెప్పి "నిల్చోబెట్టే మాట్లాడుతున్నాను, లోనికి రమ్మనడమా, వద్దా" అన్న సందిగ్ధంలో పడింది జానకి.

"వెడతానండీ, రేపు సాయంత్రం వస్తాము. వారం రోజులనించీ తిరుగుతూ వుంటే ఇన్నాళ్ళకి దొరికింది ఇల్లు. ఫేమిలీ, గెస్టు హౌస్‌లో వుంది" అంటూ నమస్కారంచేసి బయటికి వెళ్ళిపోయాడు. కారు మలుపుతిరిగేదాకా అటే చూసింది జానకి.

ఎంత మర్యాదగా, హుందాగా మాట్లాడాడు! తనని చూడడానికి వచ్చిన నాటి దర్పం, గర్వం పోయి నిబ్బరం, ఠీవి వచ్చాయి. అవును—అప్పటి కింకా చిన్న తనం! ఇప్పుడు బాధ్యతలు, లోకం తెలిసిన మనిషి!....జానకి ఆలోచనల్లో యేళ్ళ క్రితం తనని మురిపించిన ఆశలు, చివరకి అవి చోటిచ్చిన నిరాశలు మెదల సాగాయి.

ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ "అమ్మా, ఆకలేస్తూంది. అన్నం పెట్టు" అంటూ, విసిగిస్తున్న పిల్లలిద్దరినీ చెరొకటీ అంటించి లోనికి నడిచింది జానకి.

రాత్రికూడా సరిగా నిద్రపట్టలేదు. "తనని కాదని అతను చేసుకున్న ఆమె ఎలా గుంటుందో! వాళ్ళ సంసారం చూస్తూ, వాళ్ళ కలిమితో తమ లేమిని పోల్చుకుంటూ రోజులు గడపాలిగావును! అత నిక్కడిక్కి రాకపోతే ఎంత బాగుండును!" అనుకుంది.

* * *

ఉదయం పదిగంటలకి నిన్న ఆయనతో వచ్చినతను మనుషులను తీసికొచ్చి యిల్లంతా తుడిపించాడు. మిగతా అలంకరణ అంతా మధ్యాహ్నందాకా సాగింది.

సరిగా మూడు గంటలకి రెండు లారీలు ఇంటిముందు ఆగాయి. సోఫాలు' బీరువాలు, డ్రెస్సింగ్ టేబిల్, ఫ్రిజిడేరు, బల్లలు, కుర్చీలు, జంటమంచాలు, దిగుతున్న రకరకాల సామానుని గుమ్మంలో నుంచుని ఆశ్చర్యంగా చూసింది జానకి. సామా నంతనీ చూసి లోపలికి జేర వేయిస్తున్నారు. గుమాస్తాలు, బంట్రోతులు, అసలు వాళ్ళెవరూ అక్కర లేకుండానే కార్యక్రమమంతా జరిగి పోతూంది.

సాయంత్రం చల్ల బడ్డాక, సామానంతా సర్దడం అయాక, ఇంటిముందు కారాగినచప్పుడికి, దొడ్లో పచ్చడి రుబ్బుతున్న జానకి, అదలా వదిలేసి పరిగెత్తుకు వచ్చి కిటికీవారగా నిలబడి, దడదడలాడే హృదయంతో, ఊపిరి బిగబట్టి చూడ సాగింది. ముందు ఆయన దిగి ఆరేడు సంవత్సరాల అబ్బాయిని, నాలుగైదు సంవత్సరాల అమ్మాయిని దింపాడు! తర్వాత ఆమె.

గుండెలు బిగబట్టి చూస్తున్న జానకి కళ్ళు పెదల్పయ్యాయి మంచి గులాబి రంగు ఛాయ, బాగా పొడుగు, నడినెత్తిన ప్యాషన్‌గా చుట్టిన సిగ, స్లీవ్‌లెస్ బ్లౌజ్, బంగారపు వాచి ఎడంచేతికి, కుడిచేతికి నాలుగు బంగారపు గాజులు, హైహీల్ షూస్, నాజూకైన హేండుబేగ్! చక చక నడుస్తూ లోనికి వెళ్ళిం దామె. కాసేపటికి, ఇల్లంతా మోస్తోంది కాబోలు—"ఈ సామాను ఇక్కడెందుకు పెట్టారు? ఆ బీరువా ఏది? ఇది తీసికెళ్ళి ఆ గదిలో పెట్టండి...." అంటూ నౌకర్లని గదమాయిస్తున్న మాటలు వినపడ్డాయి జానకికి.

జానకి గుండెలో పెద్ద మంచుముద్ద చేరి వళ్ళంతటనీ కుంచిస్తున్నట్టు చేసింది.

"జానీ!" శంకరం లోపలికి వచ్చి ఎప్పుడు బట్టలు మార్చుకున్నాడో జానక్కి తెలియదు. భర్తవంక నిశ్చలమైన కళ్ళతో చూసింది.

మురికి సైను బనీను, ఖద్దరు లుంగీ, హవాయి చెప్పులూ, ఘజాన వారం రోజుల నుంచీ విడవకుండా వాడుతున్న—తువ్వాలనుకోబడే గజం గుడ్డ - నీరసంగా, చెమటలు కక్కే బిడ్డుమొహం! - అదీ తన భర్త.

ఏడాది క్రితం కొన్న మూడు చీరలు రొటేషన్ మీద చాకలాడికీ, యింటికీ మధ్య తిరగ్గా వెలిసిపోయిన నేతచీర, వీపుమీద నగానికి వచ్చే గరిటకాడ లాంటి జడా, నాలుగున్నర అడుగుల పొడుగూ, చామనచాయా, ఫిఫ్తు ఫారంతో మానేసిన చదువూ - అదీ తను.

ముందుగదిలో, నేలమీద అడుగు ఎత్తు ముక్కాలిపీట, రెండు మడత కుర్చీలు - రాత్రికి అదే పడకగదిగా అవతారం ఎత్తుతుంది - ఒక పట్టెమంచం, మూడు చిరిగిపోయిన తుంగచాపలు! తర్వాత గదిలో పెట్టెలు, బట్టలు, ప్రక్క చుట్టలు, పప్పులు, ఉప్పులు నానాచెత్తా! మూడోగదిలో వంట, భోజనం, నలుగురూ ఒక్కసారి కూర్చోడం కుదరదు. తిండి తిని లేనప్పుడు ఒళ్ళు దగ్గిర పెట్టుకోకపోతే ఏ గిన్నో, జాడీయో, కనీసం అట్లకాడో నెత్తిమీద ఠఖిగిణతోం అంటుంది - అదీ తన ఇల్లు.

"జానీ, నీకు ఒళ్ళు తోడావా!" దగ్గిరగా వచ్చి అన్నాడు శంకరం.

"తోడలేదు, ప్రతీదానికీ నన్నే వేధించకపోతే కాస్త వెళ్ళితోడుకో" కూడ దేమిటి, చిరాకుగా అంది జానకి.

భార్య ఎందు కిలా ఖస్సు మంటూందో తెలియక తెల్లబోయాడు. మనసు సరిగా లేదేమో అని సరిపెట్టుకుని మాట్లాడకుండా లోపలికి వెళ్లాడు శంకరం.

రాత్రి భోజనం చేస్తూ యథాలాపంగా శంకరం "ప్రక్కవాటాలోకి ఎవరో వచ్చినట్లుందే, ఎవ రేమిటి?" అని అడిగాడు.

"ఏమో, వెళ్ళి అడిగిరండి, నా కేం తెలుసు," మొఖం ముడుచుకుంటూ అంది. భార్య అర్థరహిత కోపానికి కారణం తెలియక మనసు చిన్నపుచ్చుకున్నాడు.

రాత్రి నిద్రపట్టక ప్రక్కమీద పొర్లుతూ అవసోపాలు పడుతున్న జానకి చేతిని ప్రేమగా పట్టుకుని "ఏం జానీ, వంట్లో బాగులేదా, ఇవాళంతా అదోలా వున్నావు?" అని అడిగాడు.

చేతిని విసురుగా తోసేసి "వంట్లో ఏంరోగం! ఛీ....వెధవ ఉక్క.... దోమలు, చావాలి నిద్రపట్టక....ఒక్క ఫేనుకూడా కొనుక్కునే అదృష్టంలేదు-వెధవ దరిద్రం...." విసుక్కుంది జానకి.

అతిసౌమ్యుడైన శంకరానికి కూడ కోపం తెప్పించాయి ఆ మాటలు. ఏం, ఇన్నాళ్లనించీ లేని దరిద్రం ఇవాళ కొత్తగా ఏమి వచ్చింది? ఏమంది నీ కివాళ.... ప్రొద్దుటినించీ చూస్తున్నాను నీ వరస" తీక్షణంగానే అడిగాడు.

"హూ...." కోపంగా మూలిగి ఇంక రెట్టించకుండా బలవంతంగా కళ్ళు మూసుకు అటులిరిగి పడుకుంది జానకి.

* * *

తెల్లారింది. జానకి మామూలుగా ప్రొద్దున్నే లేచి యిల్లూ వాకిలీ తుడిచి, పొయ్యీ కుంపటీ అంటించింది. కాఫీ లయ్యేక, స్నానం చేసి, ఆదరాబాదరా వంట ముగించి, శంకరానికీ, పిల్ల లకీ పెట్టి, తనూ తింది. శంకరం ఆఫీసుకి మునలి సైకి లెక్కి వెళ్ళిపోయాడు! ఆపు చెయ్యాలంటే ఏ చెట్టుకో, గోడకో గురి చేస్తేనే కాని ఆగని సైకిలు! పిల్ల లిద్దరూ వీధిచివర తాటాకులబడిలో చదువుకోడానికి పరిగెత్తారు.

ఇదంతా ఎనిమిదేళ్ళనించీ జానకి చేస్తున్న చూస్తున్న కార్యక్రమం. ఇది ఇలా రోజూ జరగాల్సిందే! ఇందులో మార్పేం వుండదు. మార్పంటూ వుంటే, ఏ మూడు నెలలకో, ఆరునెలలకో, పండగపేరు చెప్పి సినిమాకి వెళ్ళినప్పుడు! అదయినా వారం రోజుల ముందుగా దాన్నిగురించి చర్చించి, నిర్ణయించి, ఆశగా ఎదురు చూసి, చివరికి నడుం విరిగేలా ఆ బల్ల మీద నిటారుగా మూడు గంటలు కూలబడి ఆనందించి, బయటి కొచ్చాక, మరో సినిమా చూసేదాకా ఆ ముచ్చటలే చెప్పుకుంటూ, ఆ పాటలే పాడుకుంటూ మురిసిపోవడం!

జానక్కి ఆలోచించినకొద్దీ విరక్తి, వైరాగ్యం వచ్చాయంటే ఆశ్చర్య మక్కరలేదు.

కిటికీ బయట, పొరుగు పిల్ల లిద్దరూ వరండాలో అటూ ఇటూ పరిగెడు తున్నారు. వాళ్ళ నోటివెంట ముద్దుముద్దుగా యింగ్లీషు మాటలు చిలుక పలుకుల్లా వస్తున్నాయి. ఆడపిల్లా మగపిల్ల వాడిలాగే కత్తిరించిన జుట్టూ, డీలుజెర్సీ సాక్సు, బూట్సు-తెల్లగా బొద్దుగా ఆరోగ్యంగా ఉన్నారిద్దరూ.

తలుపులేసి నిలబడి, వాళ్ళిద్దర్నీ సైగచేసి పిలిచింది జానకి. ఏదో తెలియని బాధా, ఆవేదనతో బాటు, ఆ పిల్ల లంటే ఎందుకో తనకే అర్థంకాని మమకారం, వాత్సల్యం కలిగాయి. తన పిల్లల గురించి కన్న కలలు, వాళ్ళలో నిజమవడంచేత నేమో!

"నీ పేరేమిటి బాబూ?" నవ్వుతూ అడిగింది.

"నా పేరు హేమంత్, చెల్లి పేరు కల్పన"

"ఏం చదువుతున్నారు!"

"ఇంకా ఎక్కడా చదవడంలేదు. తాతగారి దగ్గర వున్నప్పుడు కాన్వెంట్ నే సెకండ్ స్టేండర్, చెల్లి కిండర్ గార్డెన్‌లో" క్రొత్తనేది లేకుండా ధాటీగా జవాబిచ్చారు.

ప్రేమగా వాళ్ళ బుగ్గలు నిమిరింది జానకి, వాళ్ళిద్దరినీ దగ్గరకు తీసికొని గుండెకి హత్తుకుంది. చెంపల్ని రెండు ధారలు జారాయి. తెల్ల బోయి చూస్తున్న ఇద్దరితో "యిక్కడే వుండండి" అంటూ హడావిడిగా లోపలికి వెళ్ళి మధూ పాపల కోసం ఏనాడో కొన్న చాక్లెట్లు రెండు తీసికొచ్చి ఇచ్చింది. ఈ లోపల శైలజ ఎందుకో బయటికి వచ్చి జానకి వంక అదోలా చూసి మొహం చిట్లించి లోపలికి వెళ్తూ "బబ్బూ, కమిన్: ఏం చేస్తున్నారక్కడ?" కేకలువేసి పిల్చింది, పిల్లలిద్దరూ భయంగా పరిగెత్తారు.

"ఎక్కడపడితే అక్కడ, ఎవరేదిస్తే అది పుచ్చుకోవచ్చా? బాడ్ మేనర్స్!" లోపల్నుంచి మాటలు వినపడ్డాయి. జానకి మనస్సు చివుక్కుమంది.

* * *

రోజులు గడిచినకొద్దీ జానక్కి వాళ్ళ గురించిన వివరాలు ఒక్కొక్కటి తెలిశాయి. ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. రాత్రిళ్ళూ పగలూ ఎందరెందరో పెద్ద మనుషులు వస్తూపోతూంటారు. ఆయన ఆఫీసుకి వెళ్ళడానికి ఒక టైమంటూ వుండదు. కావాలనుకున్నప్పుడు వెళ్ళడం, లేదంటే ఫయిళ్ళ కట్టలు ఇంటికే పంపుతారు గుమాస్తాలు.

ఆమె కలెక్టరుగారి ఏకైక పుత్రికట. ముద్దుల కూతురు. బి.ఏ. చదివింది. చిన్నప్పటినుంచీ ఎవరిమీదో ఒకరిమీద అధికారం చెలాయించడానికే అలవాటు పడిందేమో, యింట్లో ఎప్పుడూ అరుస్తూనే వుంటుంది. నౌకర్లందరికీ ఆమె అంటే హడలు. వంటకి మనిషి, పిల్లలని చూడడానికి ఆయా, మిగతా పనులకి నౌకరు - ఇంక ఆవిడ కేం పని? మల్లెపువ్వులా, మడత నలగని బట్టల్తో ఏ సోఫాలోనో పడుకుని, విలాసంగా పుస్తకం చదవడమో, ఎవరయినా వస్తే కబుర్లు చెప్పడమో! అంతే.

మొదట్లో, ఒక్కసారి ఆమెతో మాట్లాడి పరిచయం చేసుకోవాలనుకుంది జానకి. కాని....తన దగ్గిర ఎప్పుడో పెళ్ళినాటి పాత పట్టుచీర తప్పించి కాస్త శుభ్రమైనదంటూ లేదు. తీరా తను అదే కట్టుకు వెళ్ళినా, ఆమె సరిగా మాట్లాడుతుందని ఏముంది? ఎప్పుడు గుమ్మంలో కనబడినా అదోలా మొగం పెట్టి లోనికి వెళ్ళి పోతుంది. ఆమె తన గురించీ, భర్త గురించీ, ఇంటి గురించీ ప్రశ్నలడిగి చివరికి "అంత చిన్న ఇంటిలో యెలా వుంటున్నారనో," "మీ యింట్లో ఫాన్ లేదా? ఉక్క

పెట్టదూ" అనో, "రేడియో లేకపోతే ఎలా తోస్తుం"-దనో అంటే తనకి తలకొట్టేసి నట్లుంటుంది. పైగా తాను వాళ్ళింటికి వెడితే ఆవిడని తమ ఇంటికి పిలవాలి. ఆమె వస్తే యెక్కడ కూర్చోబెడ్తుంది? ఆ కుర్చీలో ఆమె కూర్చుంటే అది పరువు దక్క-స్తుందన్న నమ్మకంలేదు. యెందుకొచ్చింది? హద్దు యెరిగి మెలగడం మంచిది అని సరిచెప్పుకుంది జానకి.

వచ్చిన కొద్దిరోజుల్లోనే శైలజకి ఆ ఊర్లో యెందరో ఉన్నత కుటుంబాల ఆడవాళ్ళతో, పెద్ద ఉద్యోగస్తుల భార్యలతో, పరిచయం అయింది. ఇంచుమించు ఎవరో ఒకరు ప్రతి సాయంత్రం కార్లల్లో వస్తూ పోతూంటారు. ఈమె కూడ రోజూ ఎక్కడికో వెడుతూనే వుంటుంది.

ఇంచుమించు రోజూ భార్యా భర్తలిద్దరూ బయటికి వెడతారు. ఎక్కడికి వెళ్ళినా పిల్లలని నౌకర్ల మీద వదిలి వెళ్ళిపోవడం జానకికి ఆశ్చర్యంగా వుండేది. ఎంతహాయి! ఎందరికో అలాంటి అదృష్టం! ఆ వూర్లోవున్న రెండు ఆడవారి క్లబ్బుల్లో ఆవిడ మెంబరట!

జానకి ఆ యింట్లోకి వెళ్ళకపోయినా, ఆమెతో మాట్లాడకపోయినా, ఆయా ద్వారా, వంటవాడిద్వారా, నౌకర్ల ద్వారా, స్వయంగా విని ఎన్నో విషయాలు సేకరించింది. ఆమెకి కోపం యెక్కువ. అన్నమానం ఎవరితోనో తగువు పెట్టు కుంటేనేగాని తోచదు. సాధారణంగా అది యెవరో, ఆయనే అయ్యుంటారు! "అయ్యగారు సాధ్యమైనంత వరకు సర్దుకుపోవాలని చూస్తారు! ఆయన దేవుడు." అంటుంది ఆయా! జానక్కి విన్నకొద్దీ యింకా వినాలనే ఆరాటం హెచ్చయింది. చక్కగా తిరిగినంత సేపూ ఇద్దరూ తిరిగి ఈ కజ్జాలు ఎందుకో అనుకునేది జానకి.

ఒకరోజు జానక్కి గోడవతల్నుంచి ఆయన గొంతు వినపడింది– "నువ్విలా వందలూ, వేలూ దానాలు చేస్తూంటే ఎక్కడ్నించి వస్తుంది? నాకేం ఇండియా ప్రసి డెంటులా పదివేలు జీతం లేదు! అందులోనూ నెలాఖరు!"....

"ఎందుకలా ఊరకే చదువుతారు! బావుంది. మా క్లబ్ డేకి అందరూ చందాలు వేసుకుని మంచి మంచి ప్రోగ్రాంలు పెట్టించి ఘనంగా చెయ్యాలనుకున్నాం. మన తాహతకొద్దీ నేనూ వందరూపాయలు వేశాను. యిందులో ఇండియా ప్రసిడెంటునీ, ఇంగ్లండు మహారాణినీ తేవడం ఎందుకు?" ఆమె గొంతు లేచింది.

"మన తాహతు వందరూపాయలు క్లబ్బు చందా ఇచ్చేటంతటిదా? అసలు నీకేమైనా యింటిఖర్చు తెలుస్తుందా? నా జీతమంతా మన కారు పెట్రోలుకి చాలడం లేదు! మన వేషాలకీ, పార్టీలకీ, సినీమాలకి- యింత సరే! అదంతా చాలనట్లు, యింకా నీవిలా వందలూ, వేలూ తే అంటే యెక్కడ్నించి తెస్తాననుకున్నావు?"

"ముష్టి వందరూపాయల కోసం ఎన్నిమాటలంటున్నారు? పోనీ అంత బెంగ పెట్టుకోకండి ప్రస్తుతానికి అప్పుగా ఇస్తే, తర్వాత మానాన్నకి రాసి తెప్పించి యిచ్చేస్తాను." నిర్లక్ష్యంగా అంది.

"చాల్లే. నీ గొప్పకబుర్లు నాదగ్గిర చెప్పకు—మీనాన్న కలక్టరు గొప్పలు నాదగ్గిర చూపించకు. సిగ్గులేకపోతేసరి—ఆ మాటనడానికి" విసురుగా అని బయటికి వెళ్ళిపోయాడాయన!

వీళ్ళకి డబ్బు యిబ్బందేనా! ఆశ్చర్యపోయింది జానకి. వంద రూపాయల జీతగాడు శంకరం జన్మానికో శివరాత్రి అన్నట్లు ఎప్పుడో సినిమాకి వెళతానంటే బెంచి టిక్కట్టు అర్ధరూపాయి లేదంటాడు! ఆ దరిద్రం తన కర్థమౌతూంది. కాని వెయ్యి రూపాయల జీతగాడు ప్రసాద్ కూడా పెళ్ళాం ముచ్చట తీర్చలేక పోతున్నాడు-ఎంత చెట్టుకి అంతగాలి....నిట్టూర్చింది జానకి.

ఇంకోసారీ యిలాగే కిటికీ దగ్గర నిలబడి తల దువ్వుకుంటూంది సాయంత్రం జానకి. వాళ్ళిద్దరూ ఆరుబయట పేమ్‌కుర్చీలో కూర్చున్నారు. ఆమె బాగా ముస్తాబయివుంది. ప్రయత్నం లేకుండానే మాటలు చెవిన పడుతున్నాయి.

"నేను రాను, నువెళ్ళు కావాలంటే! నాకు వీలు అవదు" చిరాగ్గా అన్నాడు ప్రసాద్.

"బావుంది, ముందు వస్తామని. ఇప్పుడు వెళ్ళకపోతే ఏం బాగుంటుంది? మిమ్మల్ని కూడా తీసుకొస్తానని చెప్పాను వాళ్ళతోటి?"

"ఎవరినడిగి చెప్పావు? నేను వస్తానని నిన్నెవరు చెప్పమన్నారు? ఎందుకు బాగుండదు. నువ్వొకతెవే వెళ్ళు చాలా బాగుంటుంది?"

"మా క్లబ్ మెంబర్, వెడ్డింగ్ యానివర్సరీ. డిన్నరుకి పిలిచారు ఇద్దరం తప్పకుండా రావాలని మరీమరీ చెప్పారు. వస్తామని ప్రామిస్ చేశాను. యిందులో తప్పేముంది?"

"నేనూ మనిషినేగా, నాతోనూ చెప్పవచ్చుగా. కనీసం తర్వాతనైన ఆయన ఫోన్ చేస్తే ఏం పోయింది! ఎవరో ఆడవాళ్ళు నీతో చెపితే, నీకొంగు పట్టుకు తయారవడానికి నేనేం అంత చవటదద్దమ్మనికాను!"

"నాతో చెపితే ఒకటీ, మీతో చెపితే ఒకటీనా? మీకు పిలుపువచ్చిన చోటికల్లా నేను రావడం లేదూ!"

"ఇప్పుడు నీతో వాదిస్తూ కూర్చోడానికి నాకు ఓపిక లేదు. నేనురాను, నా సంగతి నీకు తెలుసు—ఒక్కసారి చెబితే ఇంక అంతే. అలా అని నిన్ను వద్దన లేదు. నువ్వు వెళ్ళు."

"నేను వెళ్ళడానికి మీ పర్మిషన్ అక్కరలేదు. నేనెలాగూ వెడతాను.... ఛీ ఎంత చదువుకున్నా యీ మగవాడన్నవాడు యింతే! ఆడది కొంత చొరవ చేస్తే సహింపు వుండదు! అందరిలో నా పరువు తియ్యాలనేగా మీ పంతం! సరే కాని వ్వండి. మీ గుణమే బయట పెట్టుకున్నారు! కోపంగా లేచి తనే కారు నడుపుకుని వెళ్ళిపోయింది.

ఎంత సంపాదన వున్నా అనుభవించడం చేతకాని మనుష్యులు! అనుకున్నంత మెత్తనివాడు కాదు అతను! విస్తుపోయింది జానకి వాళ్ళ ప్రవర్తనకి.

* * *

వాళ్ళువచ్చి రెణ్ణెళ్ళు అవుతూంది. ప్రక్కవాటాలో మాటలు మరీ యెక్కువగా వినపడ సాగాయి జానకికి ఆ మధ్యాహ్నం.

"ఎల్లుండి వాళ్ళు వస్తుంటే, నువ్వు రేపు వెళ్ళిపోవడం ఏం బాగుంది శైలూ!" ఆయన మొదట నెమ్మదిగానే అన్నాడు.

"సీట్లు రిజర్వు చేయించడం కూడ అయిపోయాక, యింక మానేదెలాగ చెప్పండి? పోనీ కాన్సిల్ చేసుకుందామన్నా, వాళ్ళందరిని యెంత నిరాశ పెట్టినట్లు అవుతుంది. నా మూలంగా మా క్లబ్ మెంబర్లందరూ నాతోపాటే అంతా చూడాలని ప్రోగ్రాం వేశారు. మద్రాసులో మా అత్తకి రాసి వీళ్ళకన్ని యేర్పాటూ చేయించాను. ఊటీలో, బెంగుళూరులో, మైసూరులో, కొడైకెనాల్లో, మధురలో అంతా నేనొకటి రెండుసార్లు తిరిగాను కాబట్టి నాకు తెలుసు. నేనున్నానని వాళ్ళు ఎంతో ముచ్చటపడి ప్రోగ్రాం వేసుకున్నారు. యిప్పుడిలా చివరిక్షణంలో నేను మానుకుంటే వాళ్ళేమనుకుంటారు!"

"వెళ్ళదలచిన వాళ్ళు ఏలాగూ వెడతారు. నువ్వు లేకపోతే పోయేదేం వుండదు! సరిగ్గా ఒకరోజు ముందర నీవిలా వెళ్ళిపోతే అమ్మా, నాన్నా ఏమనుకుంటారు?"

"వాళ్ళువస్తారని తెలిసి వెళ్ళిపోతున్నానేమిటి? ఎప్పుడనగా వేసిన ప్రోగ్రాం! నిన్నకదూ వీళ్ళ టెలిగ్రాం అందింది?

"ఇంటికి వచ్చే అత్తమామలు ముఖ్యమా. యీ సరదాలు ముఖ్యమా?" తీక్షణంగా వుంది గొంతు.

"వాళ్ళు వస్తే నేనేం చేయాలి. మీరున్నారు. వంటవాడున్నాడు. నౌకర్లున్నారు. నేనేం వండాలా, వార్చాలా."

"వాళ్ళేమనుకుంటారో అన్న ధ్యాసలేదన్నమాట నీగురించి ఏమనుకున్నా నీకు లెక్కలేదు. కాని నామాటేమిటి?"

"అంతగా వాళ్ల వచ్చేవేళకి నేనుండాలంటే యిప్పుడు వీలుకాదు. పదిహేను రోజులు పోయాక రమ్మని వ్రైరివ్వండి."

"అంతగా వాళ్ల వస్తామని రాస్తే మా ఆవిడ దేశంమీద తిరగడానికి బయలు దేరింది. యిప్పుడు రావద్దు, తర్వాత రమ్మని రాయనా! నీకు లేకపోయినా ఆ మాత్రం జ్ఞానం నాకుంది!"

"ఊరికే మాటలు జారకండి. ఏదంటే అది వదేదాన్నికాదు." ఆమె కూడా గొంతు హెచ్చించింది.

"గొంతు ఒకటుంది నీకు; ఆ ప్రక్కవాటాలో చూడు రెణ్ణెల్ల నుంచీ చూస్తున్నాను. ఏనాడైనా ఆ ఇల్లాలి మాట ఏమన్నా వినపడిందా?.... సంసారుల లక్షణం అది! చూసి బుద్ధితెచ్చుకో!"

"ఆ....మీరు ఓ గంగిరెద్దుని కట్టుకునుండాల్సింది! మీరు కూర్చోమన్నచోట కూర్చుని, ఆడమన్నప్పుడల్లా "కీ" యిచ్చిన బొమ్మలా చక్కగా ఆడుతూవుండేది!"

"చాల్లే. వినపడుతుంది!— అవును నిజమే. ఆనాడు ఆమెని అందచందాలు లేనిదనీ, మాతో తూగే తాహతు లేదనీ నిరాకరించాము. ఇప్పుడు తెలుస్తూంది. ఎంత పొరపాటు చేశానో! బుద్ధి గడ్డితిని చేసుకోలేదు. అలా ఏ లేనింటి పిల్లనో చేసుకుంటే అణిగిమణిగి వుండి నాతో సహకరిస్తూ వుండేది...."

అంత కోపంలోనూ ఆశ్చర్యంగా ఆవిడ "ఓహో! అదన్నమాట సంగతి. అందుకా అస్తమానూ ఆవిడ తలుపుచాటున నక్కి చూస్తుంటుంది. పిల్లలని చేరదీస్తూ వుంటుంది. ఎందుకో అనుకున్నాను. పాపం ఆవిడనే చేసుకువుండాల్సింది...." వెక్కిరింపుగా అంది.

"ఛప్....నోటికి వచ్చినట్లు మాట్లాడకు. విన్నారంటే బాధ పడతారు! నీకింత తలబిరుసు అని తెలియక, నీ వేషభాషకి, పై మెరుగులకి మోసపోయి గోతిలో దిగాను నాకీ యోగముంటే ఆమె నెందుకు చేసుకుంటాను!....హూ....నిన్ను చేసుకొని ఏ ఒక్కనాడు సుఖపడ్డాను? భార్య కుండవలసిన లక్షణాలు నీలో ఏ ఒక్కటయినా వున్నాయా? అడుగడుగునా నీ పుట్టింటి గొప్పతనాలు ప్రదర్శిస్తూ, ఇవతలి వాళ్లు అంత తక్కువ వాళ్ళన్నట్లు అధికారం చెలాయించడమేగా నీకు చేతనయింది! ఏనాడయినా నువ్వు పిల్లలకి నాకూ దగ్గర కూర్చుని ప్రేమగా అన్నం పెట్టావా? తిన్నామో మానామో ఏరోజయినా మా అతీగతీ కనుక్కున్నావా? నువ్వు వున్నా మేము నౌకర్ల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడవలసిందేగా? మన కుటుంబ గౌరవం కోసం, నా హోదా నిలబెట్టుకోడం కోసం, అస్తమానం నిన్ను కాదని, నీతో తగవు పెట్టుకోడం ఇష్టంలేక, నీవు చెప్పినట్టల్లా చేసి, నీవు రమ్మన్నచోటికల్లా వచ్చి, మన

మేదో ఆదర్శదంపతులమనే భ్రమ కలిగిస్తున్నాను....ఆడినకొద్దీ ఆడిస్తున్నావు. రోజు రోజుకీ నీ ఆగడం మరీ ఎక్కువై పోతోంది."

"మీరు నోటికి వచ్చినట్లల్లా మాట్లాడితే నేనూరుకోను....మీకంత బాధగా వుంటే, ఈ క్షణం ఎక్కడికయినా పోయి, నిక్షేపంలా నా బ్రతుకు నేను బ్రతక గలను. అప్పుడు మీ ఇష్టం వచ్చిన దానిని కట్టుకుని కులకండి" ఆవేశంతో ఆమె గొంతు వణికింది.

"ఇదొకటి బెదిరింపు నాకు....ఛీ, నీతో మాటలేమిటి?........" అతను లేచి బయటికి వెళ్ళిపోయాడు విసురుగా.

* * *

ఆ సాయంకాలం శంకరం మామూలుగా ఆరింటికి ఎర్రని తెల్లని కాగితం ముక్కలు అంటించిన ఫైళ్ళు నాలుగో, అయిదో చంకన పెట్టుకొని యీ జన్మకింతే అన్నట్లు, ఉస్సురంటూ ఇంట్లో అడుగుపెట్టాడు. రెండు నెలలనుండి జానకిలో చెప్ప లేని మార్పు వచ్చింది. ఇది వరకులా నవ్వుతూ మాట్లాడదు. పలకరిస్తే ఏదో ఆలోచనల్లోంచి, చికాగ్గా, విసురుగా కసురుతుంది!! ఆఫీసునుంచి ఇంటికి వచ్చేవేళకి నవ్వుతూ ఎదురొచ్చి ఆప్యాయంగా కాఫీ అందించి. పేదతీరినట్లు మాట్లాడే జానకి యిప్పుడు అసలు గుమ్మంలోకే రావడంలేదు. విసుగుగా కాఫీ తెచ్చి బల్ల మీద పెట్టి వెళ్ళిపోతుంది. పిల్లలిని వుత్తపుణ్యానికే తిట్టడం. కొట్టడం చేస్తుంది. శంకరానికి ఎంత ఆలోచించినా భార్య ప్రవర్తన అర్థంకాలేదు. ఇంట్లోవున్న కాసేపు జానకి ప్రవర్తనతో మనసు విరిగిపోయేది. ఏం మాట్లాడుతే ఏం ముప్పో అన్నట్టు ఊరు కునేవాడు శంకరం. ఎన్ని విధాలుగా అడిగినా జానకి ముభావానికి కారణం తెలుసుకో లేక 'తన తప్పేమిటో' అని మథనపడేవాడు.

జానకి శుభ్రమైన చీర కట్టింది. మొగం రుద్దీ కాటుక పెట్టిందేమో-మొఖం కళకళలాడుతూ వుంది. జడ మానేసి సిగ చుట్టి, మల్లెపూలదండ పెట్టింది.

కళకళలాడుతూ ఎదురొచ్చిన జానకిని చూసి ఆశ్చర్యపోయాడు శంకరం. లోనికి వెళ్ళి కాఫీగ్లాసు తెచ్చి అందిస్తున్న జానకిని చూసి, "ఇవాళ రాణీగారెందుకో అప్సరసలతో పోటీ పడ్తున్నారు." బెదురుతూనే అన్నాడు శంకరం. మనసు సరిగా వుండాలేగాని విట్లు వేయడంలో, ఆమె అందం పొగడడంలో ఫస్టు. ఎలాగైనా కొద్దిపాటి కవి హృదయం వుంది శంకరానికి.

"ఏడేళ్ళు దాటినా ఆమాటే అంటున్నారు! ఎప్పుడూ అవే కబుర్లా? క్రొత్తవి చెప్పాలిగాని! సరే పోన్లెండి గానీ నీళ్ళు తోడాను, చల్లారిపోతాయి, త్వరగా కానీ

యండి. సబ్బూ, తువ్వాలు అక్కడే వున్నాయి." ముసి ముసి నవ్వుతో అంది జానకి.

కలా, మాయా, అనుకున్నాడు శంకరం. కొద్ది రోజుల క్రిందటి జానకి విసుగు, కోపం అర్థం అవలేదు! ఈ నాటి ఆమె ఆదరణా, అభిమానం కూడా అర్థం అవడంలేదు శంకరానికి!

# తాగితే వట్టు!

రాత్రి పదిన్నరకి స్కూటర్ చప్పుడు విని సంబరంగా తలుపు తీసిన వారం రోజుల కొత్త పెళ్ళికూతురు సరళ తూలుతూ వస్తున్న రామ్మూర్తినిచూసి "ఏమిటి తాగారా" అంది ఆశ్చర్యకరమైన విషయం చూస్తున్నట్టు. విలాసంగా ఓ నవ్వు నవ్వి భార్య బుగ్గమీద చిటిక వేసాడు రామ్మూర్తి.

"పార్టీ కెళ్ళి తాగకుండా వచ్చే పిచ్చివెధవెవ్వడే చిన్నారీ...." లోపలికి సరళ భుజంమీద చెయ్యివేసి నడిచాడు.

"మీరు తాగుతారని నాకెప్పుడూ చెప్పలేదేం" గుమ్మంలోనే నిలేసింది.

"ఆహాహా....బలే ప్రశ్న వేసావ్ శ్రీమతీ. నే తాగుతా, సిగరెట్టు కాలుస్తా, స్నానం చేస్తా, భోజనంచేస్తా సుమా అని పెళ్ళిచూపులపుడే చెప్పాలంటావా...."

"అబ్బ అదికాదు....ముందు వదలండి నన్ను....ఛీ... కంపు మీరూనూ. నన్ను ముట్టుకోకండి - తాగడం, భోజనం చేయడం ఒకటే అన్నట్టు మాట్లాడు తున్నారే-" కోపంగా అంది.

"నా రాణీ....యీ రోజుల్లో తాగని మగాడెవడో నాకు చూపించు...." అతని మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి.... "అలా చూపించు....అప్పుడు చెప్పుచ్చుకు కొడ్తువుగాని...." భార్యని మోటుగా-దగ్గిరికి లాక్కున్నాడు. "డార్లింగ్.... నీవెంత బాగున్నావో తెలుసా....తెల్ల చీర, మల్లెపూలు, ఓహో....అప్సరస దిగొచ్చిందా నా కోసం...."